సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 11 । జూన్ । 2023



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 20 కోడెలను ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో చౌటపల్లికి చెందిన తిరుపతమ్మ గోశాలకు శనివారం అందజేశారు.



రాజన్నకు వీకెండ్ తాకిడి

వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. జబర్దస్త్ ఫేమ్ కార్తీక్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వృత్తికే ఉద్యోగ విరమణ



హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: ఉద్యోగ విరమణ వృత్తికేనని, వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. హోంగార్డు ఎస్.సత్యనారాయణకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికిన సందర్భంగా పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు. వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.10వేల చెక్ అందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ మొగిలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ మొగిలి కోరారు. రాచర్ల బొప్పాపూర్‌లో చట్టాలపై దళితులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ భూ సమస్యలుంటే పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని, లేదంటే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. గ్రామంలో గొడవలు జరిగే అవకాశాలుంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాను పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపిక



ప్రదీప్‌ను సన్మానిస్తున్న సీఐ, సిబ్బంది

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొమిరె ప్రదీప్ యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జాతీయస్థాయిలో 89వ ర్యాంక్ సాధించాడు. ఈ ర్యాంక్‌తో కేంద్ర సాయుధ బలగాలలో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాడు. రాష్ట్రంలో ఇద్దరు ఎంపికవగా ప్రదీప్ ఒకరు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రదీప్‌ను శనివారం సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సహచర సిబ్బంది సన్మానించారు. ప్రస్తుతం ప్రదీప్ భారతీయ వాయుసేనలో స్టోర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

పాలిటెక్నిక్ విద్యపై అవగహన

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 13, 14 తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాలిటెక్నిక్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను సదస్సుకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ కోర్సులు, వాటికి గల ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వెబ్ కౌన్సిలింగ్‌లో విద్యార్థులకు పలు మెళకువలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉత్తర భారత యాత్రలకు తరలిన మహిళలు



ముస్తాబాద్(సిరిసిల్ల): స్వశక్తి సంఘాల మహిళలను ఉత్తరదేశ యాత్రలకు సర్పంచ్ కల్వకుంట్ల వనజ పంపించారు. మండలంలోని మోహినికుంటకు చెందిన 80 మంది స్వశక్తి సంఘాల మహిళలను రెండు బస్సులలో శనివారం ఉత్తర భారత యాత్రకు పంపారు. కాశీ, అయోధ్య, అలహాబాద్, ఉజ్జయిని ప్రాంతాలను సందర్శించనున్నారు. భోజనం, వసతితో కూడిన యాత్రలను ఏర్పాటు చేశామని సర్పంచ్ వనజ తెలిపారు. రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ సంధ్య, సతీశ్, శ్రీనివాస్ ఉన్నారు.

- వాహనదారులకు, పౌరులకు రోడ్డు భద్రతపై ప్రచారం, అవగాహన కల్పించే ఓ రవాణాశాఖ అధికారి విదేశాలకు వెళ్లినప్పుడు డ్రైవింగ్ చేశాడు. యూటర్న్ తీసుకుని అలవాటు ప్రకారం వాహనాన్ని ఎడమకు తిప్పారు. అది 150 కిలోమీటర్ల స్పీడ్ ఉన్న రోడ్డు అదృష్టం కొద్దీ ఎదురుగా ఏ వాహనం రాలేదు.
- ఇటీవల విదేశాల నుంచి ఇండియాకు వచ్చిన ఓ వాహనదారుడు విదేశాల అలవాటు ప్రకారం కరీంనగర్ రోడ్డుపై కుడివైపు నుంచి కారును నడిపి భారీ ప్రమాదానికి కారణమయ్యాడు.



సండే స్పెషల్

కుడి ఎడమైతే.. ప్రమాదమేనోయ్!

- ఇండియాలో కుడి, విదేశాల్లో ఎడమ డ్రైవింగ్
- పెరుగుతున్న అంతర్జాతీయ లైసెన్స్‌లు
- ఐటీ, విదేశీ విద్యతో అధికమవుతున్న డిమాండ్

కొత్తలో గందరగోళం



కొత్తలో డ్రైవింగ్ చేసేటప్పుడు సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ సరిగానే నడపగలిగా. ఒకసారి నా కారు ఇంకో కారును తాకినప్పటికీ పెద్దగా నష్టం జరగలేదు. ఇండియాలో వాహనానికి కుడి పక్కన స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ పక్కన స్టీరింగ్ ఉంటుంది. కొత్తగా అమెరికా వచ్చిన వారికి కొంత కన్ఫ్యూజన్ ఉంటుంది. ఇక్కడి నిబంధనల ప్రకారం ముందుగా ఆన్‌లైన్ టెస్ట్ అయ్యాక డ్రైవింగ్ టెస్ట్ కోసం రోడ్డుపై వాహనం నడపాల్సి ఉంటుంది. సరిగా నడుపుతున్నారా పరిశీలిస్తారు. సరిగ్గా చేస్తేనే లైసెన్స్ జారీ చేస్తారు.

– నంగునూరి సాయి రతన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సిటీ బ్యాంక్, డల్లాస్

అమెరికాకు వెళ్లే ముందు..



మాది కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లి. 2011లో ఉద్యోగరీత్యా అమెరికా వచ్చా. అమెరికాకు వచ్చే ముందు తిమ్మాపూర్‌లోని రవాణా కార్యాలయంలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న. ఐదేళ్ల వ్యాలిడిటీ ఇచ్చారు. తర్వాత అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందా. మూడేళ్లకోసారి వీసాకాలం ముగిసేసరికి రెన్యూవల్ చేయించుకుంటున్న. ఇండియాలో కుడివైపు డ్రైవింగ్ స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ వైపు ఉంటుంది. అందుకే ఇక్కడ లైసెన్స్‌కు ప్రాధాన్యత ఉంది.

– చింతం నరేందర్, అమెరికా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కుడి, ఎడమైతే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్ అన్నాడో సినీ కవి. కానీ...అంతర్జాతీయ డ్రైవింగ్ విషయంలో అలాకాదు.. కుడి ఎడమైనా.. ఎడమ కుడి అయినా.. ప్రమాదాలు జరుగుతాయ్..ప్రాణాలు పోతాయ్.. అంటున్నారు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు. తాజాగా ఒడిశాలోని రైలు ప్రమాదం కూడా ఇదేవిధంగా ఒక ట్రాక్‌లో వెళ్లాల్సిన రైలు మరో ట్రాకుపై వెళ్లడంతోనే జరిగిందని ప్రచారం జరుగుతున్న వేళ.. ఒక దిశలో వెళ్లాల్సిన వాహనం మరో దిశలో పొరపాటునో, గ్రహపాటునో వెళ్తే ఎంతటి భారీ ప్రమాదం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు గాలిలో కలుస్తాయో చెప్పకనే చెప్పింది. కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం హైదరాబాద్, పలు జిల్లాల నుంచి ఐటీ నిపుణులు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాల బాట పడుతున్నారు. అగ్రరాజ్యాలు కాబట్టి అక్కడ వ్యక్తిగత వాహనాల వినియోగం అధికం. అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా మనవాళ్లు ఇక్కడే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. కాబట్టి, విదేశాలకు వెళ్లే వారంతా అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వీటికి డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో రోడ్డు నిబంధనలు కూడా ముఖ్యమే అన్న సంగతి చాలామంది మరిచిపోతున్నారు. దీంతో విదేశాల్లో డ్రైవింగ్ చేసే సమయంలో చిన్న పొరపాటు చేసినా దిద్దుకోలేని తప్పుగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందు సాధన చేయాలి



విదేశాలకు వెళ్లిన ప్రతీ భారతీయుడికి మొదట్లో ఎదురయ్యే సమస్యే ఇది. చూసేందుకు చిన్నదిగా కనిపించినా క్షణాల్లో భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం అధికం. ముందుగా అక్కడి రోడ్డు నిబంధనలు అలవాటు అయ్యే వరకు అక్కడ వాహనాలపై సాధన చేయాలి. అక్కడి రోడ్డు నిబంధనలపై పట్టు వచ్చాకే డ్రైవింగ్ చేయాలి.

– పుప్పాల శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఆర్టీఏ

జత చేయాల్సిన పత్రాలు

ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, వెళ్లాలనుకునే దేశం జారీచేసిన వీసా(తప్పనిసరి కాదు), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫారం–1ఎ పత్రాలు, రూ.1700 ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు

ఏడాది వ్యవధిలో జారీ అయిన లైసెన్స్‌లు

2022 మేలో 34, జూన్‌లో 70, జులైలో 142, ఆగస్టులో 167, సెప్టెంబర్‌లో 92, అక్టోబర్‌లో 42, నవంబర్‌లో 44, డిసెంబర్‌లో 160, ఈ ఏడాది జనవరిలో 84, ఫిబ్రవరిలో 48, మార్చిలో 32, ఏప్రిల్‌లో 59, మేలో 77 లైసెన్స్‌లు జారీ అయ్యాయి.

ఏంటి సమస్య?



సాధారణంగా ఇండియా రోడ్డు నిబంధనల ప్రకారం రోడ్డుకు ఎడమ వైపు వాహనాలు ప్రయాణిస్తాయి. అందుకే మనం 'ఆల్వేస్ కీప్ లెఫ్ట్'' అన్న సూచికలు పెడుతుంటాం. రోడ్డు భద్రత విద్యలో భాగంగా పాఠ్యపుస్తకాల్లోనూ ఎడమవైపు వెళ్లాలనే చదువుకున్నాం. ఇక్కడ పుట్టి పెరిగిన వారంతా వాహనాలను ఎడమ వైపు నడుపుతారు. ఇండియాలో పుట్టి పెరిగిన కొందరు విదేశాల్లో కొన్నిరోజులు ఉండాల్సి వచ్చినప్పుడు డ్రైవింగ్ అనివార్యమవుతుంది. పైగా మనకు అక్కడి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అక్కడ రహదారులు 120, 150 కిమీల వేగానికి అనుగుణంగా రూపొందించి ఉంటాయి. అక్కడ డ్రైవింగ్ చేసే సమయంలో పొరపాటున ఎడమవైపు వెళ్లారో ఇక అంతే.. భారీ విషాదానికి మీరే బాధ్యులుగా మిగిలిపోతారు. ఇక రెండో రకం సమస్య ఏంటంటే.. ఇండియాలో పుట్టి పెరిగి విదేశాల్లో స్థిరపడ్డ వారిలో కొందరు సెలవులకు ఇండియాకు వచ్చిన సమయంలో పొరపాటున కుడి వైపునకు వాహనాలను జోరుగా దూకిస్తారు. ఫలితంగా జరగరాని అనర్థాలు క్షణాల్లో జరిగిపోతాయి. ఏ దేశానికి వెళ్లినా ముందుగా అక్కడ రోడ్డు నిబంధనల ప్రకారం సాధన చేయాలి. డ్రైవింగ్ వచ్చు కదా అని తొందరపడితే భారీ మూల్యం చెల్లించకతప్పదని ఆర్టీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎందుకు?

విదేశాల్లో విద్య, ఉపాధి కోసం వలస వెళ్లే వారికి ఈరోజుల్లో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. వీటిని దేశంలో ఎక్కడైనా తీసుకోవచ్చు. ఈ డ్రైవింగ్ లైసెన్స్‌ను చూపించి ప్రపంచంలో ఎక్కడైనా దాదాపు ఏడాదికాలం అక్కడి రోడ్డు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసుకునే వీలు కలుగుతుంది. అన్ని దేశాల్లో వెంటనే వాహనం తీసేందుకు అంగీకరించరు. కొందరు ముందుగా స్థానికంగా తమ రోడ్లపై నడపగలరు అని నిరూపించుకునేందుకు కొన్ని పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతే డ్రైవింగ్‌కు అనుమతిస్తారు. ఏడాదిపాటు వ్యాలిడిటీ ఉండే ఈ లైసెన్స్‌ను కాల పరిమితి ఆధారంగా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు పరివాహన్.గవ్.ఇన్ (https://www.parivahan.gov.in) హెచ్‌టీటీపీఎస్: //డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఏఆర్ఐవీఏహెచ్ఏఎన్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆర్టీఏ కార్యాలయంలో పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

వికేంద్రీకరణతోనే సుపరిపాలన

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు
- కలెక్టరేట్‌లో సుపరిపాలన దినోత్సవం
- ఉద్యోగులకు బయోమెట్రిక్ మిషన్ ఏర్పాటు



మాట్లాడుతున్న వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల: వికేంద్రీకరణతోనే సుపరిపాలన సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను చెప్పిన ప్రొఫెసర్ జయశంకర్, చిన్న రాష్ట్రాల ఏర్పాటు పార్లమెంట్‌కే ఉందని రాజ్యాంగంలో తేల్చిచెప్పిన బీ.ఆర్.అంబేడ్కర్‌కు తెలంగాణ సమాజం రుణపడి ఉండాలన్నారు. తొమ్మిదేళ్లలో ఎన్నో సంస్కరణలతో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాజన్న సిరిసిల్ల చిన్న జిల్లా అయినా ఎంతో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో జిల్లా ముందుకుసాగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ యంత్రాంగానికి బయోమెట్రిక్ మిషన్‌ను ప్రారంభించారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, డీఆర్వో శ్రీనివాస్‌రావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి మాట్లాడారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, సీపీవో పీ.బీ.శ్రీనివాసచారి, డీపీవో రవీందర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డీసీవో బుద్ధనాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు పాల్గొన్నారు.

జెడ్పీలో సుపరిపాలన దినోత్సవం

సిరిసిల్ల: జిల్లా ప్రజాపరిషత్ ఆఫీస్‌లో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తన చాంబర్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదాలత్ తీర్పు అంతిమం



సిరిసిల్లలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత



వేములవాడలో మాట్లాడుతున్న సబ్ జడ్జి రవీందర్

- జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమమని జిల్లా జడ్జి ఎస్.ప్రేమలత పేర్కొన్నారు. సిరిసిల్ల కోర్టుహాల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో మాట్లాడారు. అదాలత్‌లో రాజీపడితే కలిగే లాభాల గురించి వివరించాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. అదాలత్‌లో ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. సిరిసిల్ల, వేములవాడల్లోని కోర్టు కాంప్లెక్సులలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,041 కేసులు పరిష్కారమయ్యాయి. బ్యాంకులు, ప్రమాదబీమా కేసుల్లో రూ.49,54,415 విలువైన లావాదేవిలు సెటిల్‌మెంట్ జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్‌జడ్జి హిమబిందు, న్యాయ సేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీయే రాచమార్గం

వేములవాడ: చిన్నచిన్న గొడవలకు ఆవేశాలకు పోయి కేసుల పాలైన వారు రాజీ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని వేములవాడ సబ్ జడ్జి సట్టు రవీందర్ పేర్కొన్నారు. వేములవాడ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జడ్జి మాట్లాడారు. పరిష్కారమయ్యే కేసులలో రాజీమార్గం కుదర్చడంతోపాటు కేసుల సంఖ్యను తగ్గించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌లో వచ్చిన తీర్పు అంతిమం అన్నారు. మొత్తంగా 246 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఏపీపీ విక్రాంత్ మాట్లాడుతూ కోర్టులు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆవేశంలో జరిగిన ఘటనలపై పునరాలోచించుకుని లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చూసుకోవాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, సీనియర్ అడ్వకేట్ నేరెళ్ల తిరుమల్‌గౌడ్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, పర్లపల్లి అంజయ్య, బొజ్జ మహేందర్, మార్శోహం అనిల్‌కుమార్, నయిమా నసరీ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన.. కూలిన చెట్లు



అంకుషాపూర్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. ఈదురుగాలులు రావడంతో రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. లక్ష్మీపూర్–అంకుషాపూర్ గ్రామాల మధ్య, బస్వాపూర్‌లో రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. అంకుషాపూర్‌లో తూకం వేసిన సుమారు 800 బస్తాల ధాన్యం తడిసిపోయింది. లారీల కొరతతో తూకం వేసిన ధాన్యాన్ని సైతం మిల్లులకు తరలించలేదు. ఒక్కో బస్తాకు 48 కిలోలు తూకం వేసి దోచుకున్నారని.. ఒక్కో బస్తాకు రూ.4 చొప్పున లారీలకు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

దైవచింతన కలిగి ఉండాలి

- త్రిదండి చినజీయర్‌స్వామి



ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న చిన్నజీయర్‌స్వామి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రజలు దైవచింతన కలిగి ఉండాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజన్ చినజీయర్‌స్వామి పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం రేపాకలో శ్రీసీతారాముల ఆలయంలో శనివారం నిర్వహించిన కల్యాణోత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌ను, ఇల్లంతకుంటలో చినజీయర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీర్ఘాయువు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తరతరాలుగా వస్తున్న హిందూధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, సర్పంచులు రొండ్ల లక్ష్మి, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



సిరిసిల్లక్రైం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి.. ప్రాణాలు కాపాడుకోండంటూ పోలీసుల ఆధ్వర్యంలో సిరిసిల్లలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో ఎస్పీ అఖిల్‌మహాజన్ పాల్గొన్నారు. డీఎస్పీ రవికుమార్, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, ఆర్ఐ యాదగిరి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ ఆలోచనలతోనే మెడికల్ కాలేజీలు

- కేంద్ర సర్కారు రాష్ట్రానికి చేసిందేమి లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతోనే రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు రూపుదిద్దుకుంటున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆగయ్య మాట్లాడారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు రావడాన్ని బీజేపీ నేతలు పబ్బం గడుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కొత్త కాలేజీల ఏర్పాటుపై బీజేపీ ఎంపీలు, కేంద్ర ప్రభుత్వం చేసిందేమిటో చెప్పాలని కోరారు. రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. అబద్దాలు ఆడడంలో బీజేపీకి వెన్నెతో పెట్టిన విద్యగా పేర్కొన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ సిరిసిల్లలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కావాలని మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి వందలాదిసార్లు కోరినా మంజూరు చేయడం లేదన్నారు. ఇది బీజేపీకి రాజన్న సిరిసిల్ల జిల్లాపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు


కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారి

సిరిసిల్లక్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. గత రెండు నెలల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులో పట్టుబడిన 120 మందిని లోక్‌అదాలత్‌లో భాగంగా కోర్టులో హాజరుపరిచినట్లు శనివారం తెలిపారు. అనంతరం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రాజు, కానిస్టేబుల్ స్వామి పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని అనాథ ఆడబిడ్డ పెళ్లికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి చేయూతనందించారు. స్థానిక ఆరోవార్డులో నివసించే శనిగరపు మౌనిక వివాహానికి శనివారం రూ.10వేల నగదు, ఇతర సామగ్రి అందించారు. మౌనిక తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అమ్మమ్మ దగ్గర పెరిగింది.

ఆరోగ్య సమాజమే లక్ష్యం

చందుర్తి: గ్రామాల్లోని నిరుపేదలకు ఖరీదైన వైద్యసేవలు అందించేందుకే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్యవిజ్ఞాన సంస్థ అధినేత లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. లింగంపేటలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ ప్రచారం కోసం కాకుండా.. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి శాశ్వతంగా నిర్మూలించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పరిశోధనలకు తమ వైద్య విజ్ఞాన సంస్థ సిద్ధంగా ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యమన్నారు. సర్పంచ్ దప్పుల లక్ష్మి, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, ఎంపీటీసీ పెగ్గెర్ల రమేశ్‌రావు, ఉపసర్పంచ్ జలగం ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాహిత్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం తెలిపారు. ఎంపిక చేసిన కవితల కవులు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

బాలుడిపై కుక్క దాడి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలకేంద్రంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం చింటు అనే బాలున్ని కుక్క కరిచింది. గాయపడ్డ బాలుడిని ఉపసర్పంచ్ సింగారపు నాగరాజుగౌడ్ వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

నీటి నిల్వలపై దృష్టి పెట్టాలి


హరిదాస్‌నగర్‌లో చెరువును పరిశీలిస్తున్న అధికారులు


కలెక్టర్‌తో సమావేశమైన కేంద్ర జలశక్తి బృందం అధికారులు

- కేంద్ర జలశక్తి బృందం అధికారులు
- ఐదు గ్రామాల్లో పర్యటన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూగర్భ జలాలను పెంపొందిస్తూ.. ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టుకోవాలని కేంద్ర జలశక్తి అభియాన్ అధికారి గణేశ్‌కుమార్ బరాన్వాల్ పేర్కొన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్, రాజన్నపేట, సింగారం, అల్మాస్‌పూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో శనివారం పర్యటించారు. అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెక్‌డ్యాంలను పరిశీలిస్తూ నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కుంటలు, చెరువుల నుంచి నీరు వృథాగా పోకుండా చూడాలన్నారు. డిప్యూటీ కార్యదర్శి నారాయణ దామోదర్, సైంటిస్ట్ విషాకంపాటియా, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీడీవో చిరంజీవి, ఏపీవో నర్సింలు, సర్పంచులు అమృత, నర్సాగౌడ్, ముక్క శంకర్, రాధారపు పుష్పల, ఫారెస్ట్‌రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు, ఏపీవో కొమురయ్య పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ బృందంతో కలెక్టర్ భేటీ

సిరిసిల్ల: జిల్లాలో రెండు రోజులుగా పర్యటిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం కలిశారు. కలెక్టరేట్‌కు వచ్చిన కేంద్ర బృందానికి కలెక్టర్ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ గణేశ్‌కుమార్, సీజీడబ్ల్యూడీ సైంటిస్టు నారాయణ్ దామోదర్‌తో కలెక్టరేట్‌లో భేటీ అయ్యారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు, జిల్లాలో భూగర్భజలాల అభివృద్ధి, గ్రామీణ కూలీలకు లభిస్తున్న ఉపాధి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేదించారు. జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి ఉన్నారు.

అందుబాటులో ఆర్‌అండ్‌బీ సేవలు


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ సెక్షన్ కార్యాలయాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇంతకాలం మండలంలోని ఆర్‌అండ్‌బీ సెక్షన్‌లో గల పనుల కోసం సిరిసిల్ల వెళ్లడం ఎంతో ఇబ్బందిగా ఉండేదన్నారు. స్థానికంగా కార్యాలయం ఏర్పాటుతో కష్టాలు తొలగిపోయాయన్నారు. ఏఈ నరేందర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యాలయం మంజూరుకు కృషి చేసిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈ కిరణ్‌రావు, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, పట్టణ అధ్యక్షుడు బందారి బాల్‌రెడ్డి, సిబ్బంది కిషన్, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే కొత్త పథకాలు


మాట్లాడుతున్న స్వామిగౌడ్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం కొత్త పథకాలను అమలు చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెపెల్లి స్వామిగౌడ్ విమర్శించారు. బీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. బహుజనులను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే పరిగణిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యం సాధించేందుకు పాటుపడాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం, మేకల మునీందర్, ఉపాధ్యక్షుడు చంద్రునాయక్, ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, యారపు అంజిబాబు, లింగంపల్లి మధూకర్, సంధ్యానాయక్ ఉన్నారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే దశాబ్ది ఉత్సవాలు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి


కాంగ్రెస్ కండువా కప్పుతున్న మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని గూడెం, ఆవునూర్ గ్రామాల్లో శనివారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో ఏం సాధించారని ఊరురా పండగలు చేస్తున్నారో చెప్పాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నట్టేట ముంచిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎల్లాగౌడ్, కొండం రాజిరెడ్డి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, రాంరెడ్డి, గుండెల్లి శ్రీను, గజ్జెల రాజు, బాలయ్య, బొప్ప తిరుపతి, శంకర్, చంద్రమౌళి, సత్యానందం, రమేశ్, రాజయ్య, ప్రవీణ్, ప్రశాంత్, నవీన్, ఆంజనేయులు, భాస్కర్, లక్ష్మారెడ్డి, సిద్ధారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

కాపర్ దొంగల అరెస్టు


దొంగలను అరెస్టు చూపుతున్న ఎస్సై

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో రెండు నెలల క్రితం బోరుబావుల వద్ద కరెంట్ తీగలను చోరి చేసిన ఘటనలో ఇద్దరు దొంగలను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇరవై మంది రైతుల బోరు మోటార్ల నుంచి కాపర్ కోసం వరుస చోరీలకు పాల్పడ్డారన్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టగా.. ముస్తాబాద్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం తెలిసిందన్నారు. ఇద్దరు దొంగలది తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణాకు చెందిన సూర రాజు, సూర పోచయ్యలుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితులను నుంచి 10 కిలోల రాగి, ఒక బోరు మోటారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న పీసీలు రాజశేఖర్, ఖాసీంలను ఎస్సై అభినందించారు.

చందాలతో అంత్యక్రియలు


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అంకం బాలరాజు(60) అనారోగ్యంతో శనివారం కన్నుమూశాడు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకూ డబ్బులు లేకపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న దాతలు ఆర్థికసాయం చేయడంతో అంతిమయాత్ర నిర్వహించారు.

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను మొదటి స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఈవీఎం తనిఖీపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంల తనిఖీలు చేపట్టాలని సూచించారు. సర్దాపూర్ గోదాములో ఈవీఎంలు ఉన్నాయని వాటిని ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు మొదటిస్థాయి తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ కోరారు. టేబుల్ సూపర్‌వైజర్లు, సహాయకులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను, నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కపల్లికి గ్రంథాలయం మంజూరు


భవనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లికి గ్రంథాలయం మంజూరు కాగా.. భవనాన్ని అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం పరిశీలించారు. మండలానికో గ్రంథాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేయడంతో సొంత భవనం ఉన్న ఈ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటును పరిశీలించారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఈ భవనానికి రూ.లక్ష మంజూరుచేస్తూ ఏర్పాట్లు త్వరగా చేయాలని సూచించారు. డీపీవో రవీందర్, సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో రమేశ్, కార్యదర్శి గడ్డం చందన పాల్గొన్నారు.

గంథాలయ భవనం పరిశీలన

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరంలో గ్రంథాలయం మంజూరైంది. ఈ పనులను శనివారం అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాలయం పనులు ఈనెల 20లోపు పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. డీపీవో రవీందర్, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కుటుంబ పాలనకు కాలం చెల్లింది

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ


మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జయశ్రీ

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కుటుంబ పాలనకు కాలం చెల్లుతోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ పేర్కొన్నారు. సిరిసిల్లలో శనివారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న పథకాల నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. సిరిసిల్లలోని టెక్స్‌టైల్ పార్కును ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, ఉపాధ్యక్షుడు శీలం రాజు, కర్రెల్ల మల్లారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మీయాదవ్, బీజేవైఎం అధ్యక్షుడు రాజిరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కృష్ణస్వామి, ఎస్టీ మోర్చా కోనేటి సాయిలు, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సురసురకు మరో పురస్కారం

సిరిసిల్లకల్చరల్: కోవిడ్ సంక్షోభ సమయంలో ఆపన్నులకు వైద్యసేవలు అందించిన ఛాతీ వైద్యనిపుణుడు సురసుర రాధాకృష్ణను మరో పురస్కారం వరించింది. శ్రీశాంతికృష్ణ సేవా సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. ఉత్తమ వైద్యస్ఫూర్తి ప్రదాత బిరుదు, స్వర్ణ కంకణాన్ని బహూకరించారు.

పోలీసుల అదుపులో సైబర్ నేరగాడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర సైబర్ క్రైమ్ ముఠా సభ్యుడు ఉన్నట్లు తెలిసింది. జిల్లాకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్‌కు వివిధ పనుల కోసం నాన్‌ట్రేడ్ సిమెంట్ అవసరం పడింది. దీని కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా బిహార్‌కు చెందిన కుందన్ లైన్‌లోకి వచ్చాడు. ప్రముఖ కంపెనీకి చెందిన నాన్‌ట్రేడ్ సిమెంట్ బస్తా ఒక్కంటికి రూ.275లకు సరఫరా చేస్తామని నమ్మించాడు. సదరు కాంట్రాక్టర్ గత నెల 10వ తేదీన రూ.2.66 లక్షలు కుందన్‌కు పంపాడు. అయితే 24 గంటల వ్యవధిలో సిమెంట్ బస్తాలు సరఫరా చేస్తామన్న నేరగాడు పంపకపోవడంతో సదరు కాంట్రాక్టర్ జిల్లా పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఎస్పీ అఖిల్‌మహాజన్ చాకచక్యంగా వ్యవహరించి సైబర్‌క్రైమ్ ముఠా సభ్యుడిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్‌గా శ్రీధర్


రాపెల్లి శ్రీధర్

వేములవాడ: లయన్స్‌క్లబ్ 320జీ జిల్లా కేబినెట్ ప్లాస్టిక్ అవేర్‌నెస్ చైర్మన్‌గా వేములవాడకు చెందిన రాపెల్లి శ్రీధర్ నియమితులయ్యారు. శ్రీధర్ వేములవాడ క్లబ్ అధ్యక్షుడి హోదాతోపాటు మరో 85 క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించాల్సి వస్తుంది. గతేడాది శ్రీధర్ వేములవాడ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన సేవలను గుర్తించిన జిల్లా గవర్నర్ హన్మండ్ల రాజిరెడ్డి నియమించారు. శ్రీధర్ మాట్లాడుతూ తమపై విశ్వాసంతో తనను నియమించిన లయన్స్‌క్లబ్ గవర్నర్ రాజిరెడ్డి, ఇతర పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేందుకు మొత్తం లయన్స్‌క్లబ్ సహకారంతో కృషి చేస్తానన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


మండెపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దివ్యాంగులకు మరింత భరోసా కల్పించేలా సీఎం కేసీఆర్ పెన్షన్ రూ.వెయ్యి పెంచడంపై మండెపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని చౌరస్తాలో శనివారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, గొడిసెల రామకృష్ణయ్య, గాదగోని మొండయ్య, పెద్ది శంకరయ్య, శ్రీనివాస్, మసూరి కుంటయ్య, బండి సత్తయ్య పాల్గొన్నారు.









ఫిష్‌ఫుడ్ అదిరేలా.. మనసు దోచేలా !



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్లలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ అదిరిపోయింది. స్టాళ్లలో ఏర్పాటు చేసిన చేపల వంటకాలు నోరూరించేలా ఉన్నాయి. చేపల ఫ్రై, పులుసు, బిర్యానీలు అదిరిపోయే రుచులతో ఆకట్టుకున్నాయి. రొయ్యల వంటకాలు సైతం నాన్‌వెజ్ ప్రియులకు విందు భోజనం అందించాయి. ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ శనివారం చివరి రోజు కావడంతో రుచి చూసేందుకు సిరిసిల్లతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైతుబజార్‌కు భారీగా చేరుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

రజక రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా దుబ్బాక రమేశ్


నియామకపత్రం అందిస్తున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా దుబ్బాక రమేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన దుబ్బాక రమేశ్‌ను రాష్ట్ర రజక యూత్ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన రజక సంఘాల అన్ని జిల్లాల నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

గేదెలను కాపాడిన ఉపాధిహామీ కూలీలు



వీర్నపల్లి(సిరిసిల్ల): పొట్లాడుకొని బావిలో పడిన రెండు గేదెలను ఉపాధిహామీ కూలీలు కాపాడారు. ఈ సంఘటన శనివారం వీర్నపల్లి మండల కేంద్రంలో జరిగింది. గేదెలను కాపాడిన కూలీలను గ్రామస్తులు అభినందించారు.

క్లుప్తంగా

సన్మానం



ఏఈ సతీశ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండల ఆర్‌అండ్‌బీ ఏఈగా సతీశ్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టగా ఎంపీపీ శాలువాతో సన్మానించారు. మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో నల్లా రాజేందర్ రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సంబ లక్ష్మీరాజం, శంకర్, నిమ్మ శ్రీనివాస రెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇల్లంతకుంట: బాల బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్లు ఎలగందుల పరమేశ్వర్, దామ కవిత అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బిల్లవేని పర్శరాం, ఉపసర్పంచ్ బత్తిని కావ్య స్వామి, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, ఆశకార్యకర్త ఎల్లవ్వ తదితరులున్నారు.

757 రోజులుగా అన్నదానం



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేములవాడ : ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు మై వేములవాడ ట్రస్టు సభ్యులు శనివారం 150 మందికి అన్నం పొట్లాలను పంపిణీ చేశారు. గత 757 రోజులుగా పేదలకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంకెపల్లి శ్రీనివాస్‌శర్మ–మంజుల దంపతులు, గజ్జెల శ్రీనివాస్, రాజశేఖర్, గోపాల్‌యాదవ్, ప్రశాంత్, వంశీ, వేణు, నాగరాజు, రమేశ్, నాగుల చంద్రశేఖర్, తోట రాజు, పొలాస రాజేందర్, కొప్పుల హనుమాన్, ప్రతాప నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన

వీర్నపల్లి : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కటింగ్ పేరిట దోచుకుంటున్నారని లారీ వద్ద రైతులు ఆందోళన చేశారు. బస్తాకు రెండు మూడుకిలోలు కటింగ్ చేయడం, రూ.3 వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు పేరిట కొర్రీలు పెడుతూ రైతులను నిండా ముంచుతున్నారన్నారు.

ముదిరాజ్‌లకు బీసీ రుణాలు ఇవ్వాలి

ముస్తాబాద్: ప్రభుత్వం వెనుకబడిన తరగతులను ఆదుకునేందుకు చేపట్టిన బీసీ రుణాల పథకంలో ముదిరాజ్ సామాజికవర్గాన్ని చేర్చాలని చిప్పలపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గాడిచెర్ల దేవయ్య కోరారు. పేదరికంలో ఉన్న ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకునేందుకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను ఏర్పాటు చేసిందన్నారు. బీసీలకు అందజేస్తున్న రూ.లక్ష పథకంలో ముదిరాజ్‌లను చేర్చాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి శ్రీ మల్లికార్జున్ యూత్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి శ్రీను, ప్రధాన కార్యదర్శి ఒగ్గు కనకయ్య, ఉపాధ్యక్షుడిగా ముద్దల పర్శరాములు, కోశాధికారి ఏనుగుల మహేశ్, కార్యదర్శి ఒగ్గు దేవయ్య, సహాయ కార్యదర్శి మసూరి మల్లేశం, సలహాదారులుగా అమరగొండ ప్రభుదాస్, ప్రశాంత్, కృష్ణాప్రసాద్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం బంద రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి శనివారం సర్పంచ్ గనప శివజ్యోతి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఆకట్టుకున్న వెల్‌బేబీ షో



సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బీవైనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వెల్‌బేబీ షో నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సునతి, మమత, సంధ్య, వినోద, సువర్ణ, ఆయా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

డోర్స్.. అదుర్స్

- ఇంటి అలంకరణకు మది దోచే తలుపులు
- ముఖ ద్వారాలకు నచ్చిన డిజైన్లలో ఉడ్ కార్వింగ్
- ఖర్చులకు వెనుకాడని వైనం
- ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ



సిరిసిల్ల అర్బన్: ఇల్లే కదా స్వర్గ సీమ అంటారు కొందరు.. ఎంతో ఇష్టపడి నిర్మిస్తున్న ఇళ్లను అంతే అందంగా అలంకరించుకోవాలని ప్రతి ఒక్కరూ ఆరాటపడుతుంటారు. ఇంటికి అందాన్ని ఇనుమడింప జేయడంలో తలుపులే ప్రధానమని చెప్పొచ్చు. చూడగానే తళుక్కుమనే విధంగా ఉండాలని తలుపులపై పలురకాల డిజైన్‌లతో బొమ్మలను వేసుకుంటున్నారు. గతంలో తలుపులు కిటికీలపై బొమ్మలు చెక్కేవారు. ప్రస్తుతం ఉడ్ కార్వింగ్‌తో కంప్యూటర్ సాయంతో ఆకర్షణీయమైన డిజైన్లను ఇంటి యజమానికి నచ్చేవిధంగా తయారు చేస్తున్నారు.



వివిధ రకాల డిజైన్లు..

ఇల్లు ఎంత ఆకట్టుకున్నా దానికి అందాన్ని తీసుకువచ్చేవి తలుపులే..కావడంతో ప్రతి ఒక్కరు తొలి ప్రాధాన్యత వాటికే ఇస్తున్నారు. ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం నుంచి మొదలు.. బెడ్‌రూమ్, కిచెన్, పూజగది, తదితర వాటికి ఉపయోగించే డోర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దర్వాజలపై పలురకాల డిజైన్లు ఏర్పాటు చేసుకునేందుకు ఇంటి యజమానులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎంత ఖర్చయినా వెనకాడకుండా డోర్లపై చిత్రాలు వేయిస్తున్నారు. దేవత బొమ్మలు, ఓంకారం, స్వస్తిక్, నెమలి, పుష్పాలు, స్వాగత బొమ్మలు, తదితర రూపాల్ల తలుపులను రుపొందించుకుంటున్నారు.



డిజైన్ బట్టి ధరలు

ఉడ్ కార్వింగ్‌తో తలుపుల డిజైన్‌లను బట్టి ధర కూడా అదేవిధంగా ఉంటుంది. ఒక్కో డోర్‌కు డిజైన్ బట్టి రూ.2వేల నుంచి మొదలుకొని రూ.10 వేల వరకు ఉంటోంది. డిజైన్ బట్టి ధరల రేటు కూడా మారుతుంది. పట్టణంలోని పలు వుడ్ కర్వాంగ్ దుకాణాల్లో కట్టెలపై అందమైన దృశ్యాలు చెక్కుతూ ఆకర్షించేలా తయారు చేసి ఇస్తున్నారు.



ఆదరణ పెరుగుతోంది



రోజురోజుకూ ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. వినియోగదారులు తమకు నచ్చిన డిజైన్లను డోర్లపై వేయిస్తున్నారు. దేవుళ్లు, పుష్పాలు, స్వాగత బొమ్మలు తదితర రూపాల్లో తలుపులను రూపొందించుకుంటున్నారు.

– రేవోజు ప్రవీణ్‌చారి, సిరిసిల్ల

కంప్యూటర్ సాయంతో డిజైన్లు



కంప్యూటర్ సాయంతో ఎంపిక చేసిన బొమ్మలను డోర్లపై రూపొందించే ప్రక్రియ ప్రజలను ఆకట్టుకుంటోంది. వారికి నచ్చిన డిజైన్లను తలుపులు కిటికీలపై వేయించుకుంటూ ఇంటికి అమర్చుతున్నారు. ఖర్చులకు వెనకాడకుండా ఇంటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

– బెజ్జెంకి సుధాకర్,వుడ్ కార్వింగ్ నిపుణుడు, సిరిసిల్ల

రోడ్డు భద్రత.. సామాజిక బాధ్యత



వేములవాడలో హెల్మెట్లు ధరించి ర్యాలీ తీస్తున్న పోలీసులు, వాహనదారులు



ఎల్లారెడ్డిపేటలో హెల్మెట్ ధరించిన వాహనదారుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ



హెల్మెట్ ధరించని యువకుడికి చెవిలో పువ్వు పెట్టిన పోలీసులు

- వాహనదారులు హెల్మెట్ ధరించాలి
- సీఐ మొగిలి
- పలు గ్రామాల్లో హెల్మెట్ వాడకంపై పోలీసుల ద్విచక్రవాహన ర్యాలీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు భద్రతను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సీఐ మొగిలి అన్నారు. మండలకేంద్రంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్లగొల్లపల్లి వరకు హెల్మెట్ ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తున్న వారికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసేవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట(మానకొండూర్): హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారి చెవిలో పువ్వులు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు ఇల్లంతకుంట పోలీసులు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య కోరారు. ఇల్లంతకుంటలో శనివారం హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు చెవిలో పువ్వులు పెట్టి, స్వీట్లు పంపిణీ చేశారు.

మర్తనపేటలో..

కోనరావుపేట: మర్తనపేటలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఏఎస్సై రఘుపతి రెడ్డి, సర్పంచ్ వంశీకృష్ణరావు, కానిస్టేబుళ్లు నవీన్, రాజశేఖర్, విశాల్, యువకులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట(సిరిసిల్ల): వాహనదారులకు హెల్మెట్ వాడకంపై గంభీరావుపేట పోలీసులు వినూత్నంగా అవగాహన నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారికి పూలు, హెల్మెట్‌తో వచ్చిన వారికి స్వీట్లు పంపిణీ చేశారు. గాంధీ చౌక్ నుంచి కేజీ టు పీజీ కళాశాల వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: మండలకేంద్రంలో హెల్మెట్ ధరించిన వాహనదారులతో ఎస్సై మామిడి మహేందర్ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కోరారు.

వేములవాడలో

వేములవాడ: పట్టణంలోని పాపన్నచౌక్ నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లోనే చాలామంది చనిపోతున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. సీఐ వెంకటేశ్, ఎస్సైలు రఫీక్ ఖాన్, వెంకట్రాజం, దిలీప్, సిబ్బంద, యువకులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి స్తూపం వరకు వాహనదారులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవత మాట్లాడుతూ.. మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వొద్దన్నారు. సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, వాహనదారులు, పోలీసు సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.



బోయినపల్లిలో హెల్మెట్‌తో వాహనదారుల ర్యాలీ

చందుర్తిలో..

చందుర్తి : రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం. ప్రమాదాలు నివారించుకుందామంటూ ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులకు గులాబీ పువ్వు అందించి అభినందించారు. పలు గ్రామాల యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఎస్సై వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుతుపున్న వారికి చెవిలో పువ్వులు పెట్టి.. అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వారికి స్వీట్లు అందజేశారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ముత్యాల ప్రభాకర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నేవూరి రెడ్డి సంక్షేమ సంఘం (మాలీపటేల్) అధ్యక్షుడిగా ముత్యాల ప్రభాకర్ రెడ్డి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నేవూరి గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా నేవూరి మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా నవజీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ముత్యాల వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, జగన్ రెడ్డి, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో నలుగురికి గాయాలు

చందుర్తి(వేములవాడ) : మండలంలోని మల్యాలో నలుగురిపై శనివారం రాత్రి పిచ్చికుక్కలు దాడి చేశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి గుర్రం బాలేశం, జంగిటి లచ్చయ్య, కొడగంటి వామిక, కొడగంటి శాన్వికపై దాడిచేసి గాయపర్చినట్లుగా తెలిపారు. తీవ్రగాయాలైన లచ్చయ్య, వామికను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

గంభీరావుపేట(సిరిసిల్ల): రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చర్లలో శనివారం పార్టీ జెండా పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్ వంటి హామీలను నెలరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన 50 మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంగి స్వామి, నాయకులు లచ్చయ్య, అరుణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్ తండాలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ గుగులోత్ కళావతి లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన భానోత్ సుజాతకు రూ.11,500, బట్టు గోదావరికి రూ.3,200, భూక్య గణేశ్‌కు రూ.3,200 మంజూరుకాగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇల్లంతకుంట: వల్లంపట్లకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గూడ రాములుకు రూ.18వేలు, కర్ల రాయనర్సుకు రూ.36వేలు, తమిశెట్టి మంజులకు రూ. 39,500 ముద్దాల కొమురయ్యకు రూ.12,500, ఎరవెల్లి మల్లయ్యకు రూ.16వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ ప్రవంతి అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గోనె మల్లవ్వ–భూమరాజం దంపతుల కూతురు మానస వివాహానికి బాల్యమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అధ్యక్షుడు సందుపట్ల లక్ష్మారెడ్డి, సభ్యులు రాగుల ఎల్లారెడ్డి, గుండారపు వేణురెడ్డి, బాలకిషన్, శ్రీనివాస్ గౌడ్, జగన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తంగళ్లపల్లిని ఆదర్శంగా నిలపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మానస



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మల్లేశం

- ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లాలో తంగళ్లపల్లి మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ పడిగెల మానస పేర్కొన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పాలన ప్రజలకు చేరువయ్యేందుకు కొత్త జిల్లాలు, కొత్త మండలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో పి.లచ్చాలు, తహసీల్దార్ సదానందం, ఇన్‌చార్జి ఎంపీవో విజేందర్ రెడ్డి, ఏపీవో నాగరాజు, సర్పంచులు అంకారపు అనిత, ముదారి పోచయ్య, ఈసరి ఉమరాజు, రంగయ్య, ఆనందరావు, ఎంపీటీసీలు కోడి అంతయ్య, లావణ్య, సిలివేరి ప్రసూన, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: కొత్తగా ఏర్పడిన మండల పరిషత్ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ బండ మల్లేశం, ప్రజాప్రతినిధులు హాజరై కేక్ కట్ చేశారు. తుర్కాషినగర్ జీపీలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో రాంరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: మండల పరిషత్ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి (వట్టిమల్ల) గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గోపు పర్శరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఉపసర్పంచ్ బండ రవి, మహిళా సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి : మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో సుపరి పాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ వైస్ ఎంపీపీ హేమ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు



ముస్తాబాద్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి (కొలనూర్)లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను మరో వెయ్యి పెంచిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు సీఎం కేసీఆర్ రూ. వెయ్యి పెంచడం హర్షణీయమన్నారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బొజ్జం మల్లేశం, దివ్యాంగులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: సీఎం కేసీఆర్‌కు దివ్యాంగులు రుణపడి ఉంటారని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు పాతూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొసర్ల లింగారెడ్డి, దివ్యాంగులు కుమ్మరి రాములు, వెంకట్‌రావు, మల్లేశం, సూతారి శ్రీనివాస్, పిల్లి రాజు, బాల్‌రాజు, ఒల్లెపు మల్లేశ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని కేసీఆర్ నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ దివ్యాంగులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. దివ్యాంగులకు పింఛన్ రూ.వెయ్యి పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

గంభీరావుపేట: పింఛన్ మరో వెయ్యి పెంచడంపై మండలంలోని దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు చేని వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని, ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్ (డబుల్ బెడ్ రూం) సముదాయంలో శనివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ డెవలప్మెంట్ (యూఎస్ఏ), ప్రగతి వెల్ఫేర్ సొసైటీ (యూఎస్ఏ), వేంకటేశ్వర ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, జీఎస్ఎంసీ మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, డాక్టర్ దివేశ్, అనిరెడ్డి, డాక్టర్ అశోక్ అగర్వాల్, పాటి నరేందర్, సునీత, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

నియామకం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని నేవూరి రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా నేవూరి ప్రభాకర్ రెడ్డి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నేవూరి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుండారపు నవీన్‌రెడ్డి, కోశాధికారిగా నేవూరి సురేశ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నేవూరి రవీందర్‌రెడ్డి, నేవూరి శ్రీనివాస్ రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, గుండారపు వెంకట్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన కొనుగోళ్లు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. కోనరావుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 275 మంది రైతులకు గాను 14,840 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సీఈవో దుమాల కేశవులు అన్నారు. సహకరించిన జిల్లా, మండలస్థాయి అధికారులు, సింగిల్‌విండో చైర్మన్, పాలకవర్గసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి: పంటలకు మద్దతు ధర పెంచినందకుగాను మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం మండల బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు నర్సింహాచారి, శ్రీనివాస రెడ్డి, సారంపల్లి రాజు, గంగాధర్ చారి, రాజూరి కిరణ్, ఐల మహేశ్, సుంకపాక ప్రభు, మారంపల్లి భూంరెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ వ్రతం

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హాజరైన భక్తులకు అనంతర అన్న ప్రసాద వితరణ అందజేశారు.